## క్లుప్తంగా

### ఘనంగా ప్రతిష్ఠోత్సవం



ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరానికి సమీపాన వెలసిన దొర్వి చెంచు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ధ్వజ, స్వామి అమ్మవార్ల ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా జరిగాయి. చివరిరోజు సోమవారం ఈ వేడుకలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రతిష్ఠోత్సవం సందర్భంగా ఎడ్ల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

### సీఐగా దస్తగిరి బాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

శిరివెళ్ల: నూతన సీఐగా సోమవారం దస్తగిరి బాబు బాధ్యతలు చేపట్టారు. గత సీఐ వంశీధర్ వీఆర్‌కు పోవడంతో ఈ నియామకం జరిగింది. నూతన సీఐ అన్నమయ్య జిల్లా డీటీసీ నుంచి బదిలీపై వచ్చారు. సోమవారం మర్యాద పూర్వకంగా డీఎస్పీ, ఎస్పీని కలిశారు.

### తాండ్రపాడు వృషభాల విజయకేతనం



నగదు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పాలపండ్ల విభాగం బండలాగుడు పోటీల్లో తాండ్రపాడుకు చెందిన ఆకెపోగు వరలక్ష్మి వృషభాలు విజయకేతనం ఎగురవేసి రూ.40 వేలు గెలుపొందాయి. పోటీల్లో మొత్తం ఐదు జతల ఎద్దులు తలబడ్డాయి. పెద్దకొట్కాల గ్రామానికి చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి ఎద్దులు ద్వితీయస్థానంలో నిలిచి రూ.30వేలు దక్కించుకున్నాయి. కానాలకు చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు తృతీయస్థానంలో నిలిచి రూ.20వేలు, కొణిదేలకు చెందిన దదు రైడర్‌స ఎద్దులు నాల్గో స్థానంలో నిలిచి రూ. 15వేలు, మండ్లెం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌కు చెందిన ఎద్దులు ఐదో స్థానంలో నలిచి రూ.10వేలు దక్కించుకున్నాయి. ఫెస్టివల్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, దొరబాబు, రమణారెడ్డి నగదు బహుమతులను అందజేశారు. దాతలు కిరణ్‌కుమార్, ఎల్లారెడ్డి, సంతోష్‌రెడ్డి, మనోహరప్ప, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

### ప్రజాప్రతినిధులు లేకుండా గ్రామసభ

మహానంది: మహానంది గ్రామ సచివాలయంలో సోమవారం స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు లేకుండానే గ్రామసభ నిర్వహించడం విశేషం. గ్రామసభ ఉందని ఆదివారం దండోరా వేయించారు. అయినా ఎవరూ హాజరు కాకపోవడంతో గ్రామానికి చెందిన ముగ్గురు టీడీపీ నాయకులను పిలిచి వారినే వేదికపై కూర్చోబెట్టి, సచివాలయ సిబ్బందితోనే సమావేశం జరిపారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను సాక్షి వివరణ కోరగా పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను పిలిచామని, పనుల వల్ల హాజరుకాకపోవడంతో నిర్వహించామని చెప్పారు.

### యువకుడి ఆత్మహత్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటకు చెందిన యువకుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రమేష్‌బాబు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పసల పాపన్న కుమారుడు జయకృష్ణ(23) బెంగళూరులో ఉద్యోగం చేస్తుండేవాడు. ఆరు నెలల నుంచి ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. మళ్లీ ఉద్యోగం వస్తుందోరాదో అని మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### వరిపైరుపై గడ్డి మందు పిచికారీ.. కేసు నమోదు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంతజూటూరు గ్రామానికి చెందిన నాగమ్మ వరి పైరుపై గడ్డి మందు పిచికారీ చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. సోమవారం తన 50 సెంట్ల పొలంలో వరి పైరుపై అదే గ్రామానికి చెందిన సుదర్శనం, భాగ్యమ్మ గడ్డి మందు పిచికారీ చేసినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తనకు రూ. 90 వేలు నష్టం జరిగిందని నాగమ్మ పేర్కొంది.

### వైభవంగా పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామివారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఉమామహేశ్వరునికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళి



ఆళ్లగడ్డ గురుకులలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్



దొర్నిపాడులో మాలమహానాడు ఆధ్వర్యంలో



నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

# ఆదర్శనీయులు అంబేద్కర్



పాలిటెక్నిక్ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



గోస్పాడు : బాబాసాహెబ్‌కు చిన్నారుల నివాళి

నంద్యాల(న్యూటౌన్/అర్బన్/వ్యవసాయం)/గోస్పాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శనీయులని వక్తలు కొనియాడారు. సోమవారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో అంబేద్కర్ జయంతిని వేడుకగా నిర్వహించారు. వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బాబాసాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో అంబేద్కర్ సేవలు అజరామరమని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం దేశానికి మార్గదర్శనం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

➡ నంద్యాలలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. అనంతరం అధ్యక్ష కార్యదర్శులు హుసేన్ బాషా, ఎంవీ కృష్ణారెడ్డి, న్యాయవాదులు పుల్లన్న, చిన్నలింగస్వామి, శ్రీనివాసులు, ఓబులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

➡ యువతకు మార్గదర్శి అంబేద్కర్ అని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆయన అంబేద్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, తదితరులు పాల్గొన్నారు.

➡ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్లు ప్రియదర్శిణి, శ్రీనివాసులు, నంద్యాల ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ గంగాధర్‌రావు ఆధ్వర్యాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో

➡ నంద్యాలలో బీజేపీ పార్టీ కార్యాలయంలో పట్టణ మాజీ అధ్యక్షుడు బ్రహ్మయ్య ఆచారి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సీపీఎం కార్యాలయంలో నాయకులు రమేష్‌కుమార్, తోటమద్దులు ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పించారు.

➡ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సహసేవా ప్రముఖ్ మనోహర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కరరెడ్డి, రామపక్కీర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు సురేష్, ఏపీటీఎఫ్ 1938 ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సాంబశివుడు, ఏపీటీఎఫ్ 275 ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య ఆధ్వర్యంలో, రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు సీడు మద్దిలేటి, కుసుమాంబ, శ్రీరాములు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీం ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➡ నందమూరినగర్‌లోని బాల కార్మిక పాఠశాలలో స్టార్ సొసైటీ అధ్యక్షుడు రాజేశ్వరమ్మ, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో ఏఈఎస్ రాముడు, సీఐలు కృష్ణమూర్తి, లక్ష్మణదాసులు అంబేద్కర్ సేవలను కొనియాడారు.

➡ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో.. పాన్నాపురం కాలనీలోని ప్రత్యేక దత్తత కేంద్రంలో సీఆర్ఎస్ నిధుల కింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సూర్యప్రకాష్, రవీంద్రనాయక్, సురేష్ తదితరులు వాసింగ్ మిషన్, ఎయిర్ కూలర్, ఫ్యాన్, వాటర్ ట్యాంక్, ప్రింటర్‌లను అందజేశారు.

➡ గోస్పాడు మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లెల్ల గ్రామంలో ఓ ఇంటికి ఏర్పాటు చేసిన తలుపునకు అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచడంతో ఎస్సీ కాలనీలోని విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు.

➡ ఎస్.నాగులవరం గ్రామంలో డీకేఆర్ అధినేత సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్, యాళ్లూరు గ్రామ సచివాలయంలో సర్పంచ్ గడ్డం రత్నమ్మ, ఉప సర్పంచ్ బెక్కెం నాగేశ్వరరెడ్డి బాబా సాహెబ్‌కు నివాళులర్పించారు.

#### అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(అర్బన్): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేద్దామని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవాడలో అతిపెద్ద అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పి ఆయన గొప్పతనాన్ని చాటారన్నారు. అదే విధంగా కోన సీమ జిల్లాను అంబేద్కర్ జిల్లాగా నామకరణం చేసి నిజమైన నివాళులందిచారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్‌బాషా, సునీత అమృతరాజ్, మేస చంద్రశేఖర్, కారురవికుమార్, ఆంజనేయులు దళిత నాయకులు పాల్గొన్నారు.

#### దేశం గర్వించదగ్గ వ్యక్తి బాబాసాహెబ్



భూమి పూజ చేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): దేశం గర్వించదగ్గ వ్యక్తి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి కలెక్టర్ రాజకుమారితో కలిసి మంత్రి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ నిరంజన్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ చింతామణి, కౌన్సిలర్లు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

#### ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నంద్యాల(అర్బన్):బీఆర్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారితో పాటు దళిత సంఘాల నాయకులు పాల్గొని బాబాసాహెబ్‌కు నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ 2 సంవత్సరాల 11 నెలల 17 రోజుల్లో భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలని సూచించారు. ఆడపిల్లలు చదువుతో పాటు ఆత్మరక్షణ కోసం కరాటే, స్విమ్మింగ్ తదితర ఆటల్లో రాణించాలన్నారు. గ్రూప్ డిస్కషన్స్‌లో పాల్గొంటే నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. అంతకు ముందు విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఇటీవల వెలువడిన ఇంటర్, వొకేషనల్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించి పుస్తకాలు ప్రదానం చేశారు. దళిత సంఘాల నాయకులు బాలస్వామి, బాల నాయక్, జీవన్ రాజ్, డీవీఎంసీ/సఫాయి కర్మచారి చైర్మన్ చెన్నమ్మ, సభ్యులు మహేశ్వరి, లక్ష్మి, శ్రీరాములు, దామోదర నాగేషు, లక్ష్మన్న, జాషువ, దేవదానం, భూషణ్, బెనర్జీ మాట్లాడుతూ అంబేద్కర్ దేశ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు చింతామణి, డీఎఫ్ఓ నాగమునేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డీపీఓ జమీవుల్లా, పరిశ్రమల జిల్లా మేనేజర్ జవహర్ బాబు, కౌన్సిలర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

#### రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

మతోన్మాద శక్తుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకుందామని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమం తహసీల్దార్ రత్నకుమారి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలికలకు బహుమతులు అందజేశారు.

దొర్నిపాడు: మండలంలోని అమ్మిరెడ్డినగరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్కు మాధవీ, లక్కు చంద్రశేఖర్‌రెడ్డి, దొర్నిపాడులో మాలమహానాడు నాయకుడు శాంపూరి సుధాకర్, ఎస్ఎంసీ చైర్మన్ శాంపూరి కిరణ్, డబ్ల్యూ గోవిందిన్నెలోని అంగన్‌వాడీ కేంద్రంలో తులసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

చాగలమర్రి: మండలంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం:మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ,ఎంపీపీ బాలస్వామి, మండల ప్రత్యేక అధి కారి నాగరాజు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, గోవిందపల్లె, యర్రగుంట్ల డిగ్రీ కళాశాల, మహదేవపురం, కోటపాడు బోయలకుంట్ల గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలు, చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

## దారి దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు



మేకల హనుమంతును అరెస్టు చూపుతున్న జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల, గుంటూరు జిల్లాల్లో దారి దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న పాణ్యం చెంచు కాలనీకి చెందిన మేకల హనుమంతు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. సుగాలి మెట్ట వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఎదుట హాజరు పరిచారు. ఈనేపథ్యంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మేకల చెంచు హనుమంతు జల్సాలకు అలవాటు పడి సన్నిహితులైన మరో నలుగురితో కలిసి 2019 నుంచి నంద్యాల, గుంటూరు జిల్లాల్లో రాత్రి సమయాల్లో దారిదోపిడీలు, దొంగతనాలు చేసేవాడన్నారు. అంతేకాకుండా పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడని, అయితే పోలీసులు కళ్లు కప్పి తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. సోమవారం సాయంత్రం పట్టుబడటంతో నిందితుడి వద్ద నుంచి 5 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ. 12 వేల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అరెస్టులో కీలకంగా వ్యవహరించిన సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, సిబ్బందిని ఎస్పీ ఈసందర్భంగా అభినందించారు.

#### చైన్ స్నాచర్ల అరెస్టు..

గత కొన్ని నెలలుగా నంద్యాల, ఆత్మకూరు పరిధిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న మద్దికెరకు చెందిన దూదేకుల షాహిద్‌వలి, కర్నూలు పందిపాడుకు చెందిన పింజరి దస్తగిరిలను సోమవారం నంద్యాల పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్‌హాలు సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి 73 గ్రాములు బంగారం, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ అండ

- వక్ఫ్ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం
- ముస్లింలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది
- మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్ రెడ్డి
- నేడు వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నంద్యాల గాంధీచౌక్‌లో నిరసన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ అన్ని విధాలుగా అండగా నిలబడుతోందని ఆ పార్టీ నేత, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో, రాజ్యసభలో తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వకపోయి ఉంటే బిల్లు పాస్ అయ్యేది కాదన్నారు. ఈ విషయంలో ముస్లింలను నమ్మించి ఆ రెండు పార్టీలు తీరని ద్రోహం చేశాయన్నారు. కూటమి నాయకులు విభజించు పాలించు రాజకీయం చేస్తున్నారన్నారు. నంద్యాలలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ ఉండి ప్రయోజనం లేదని, ముస్లింలకు జరుగుతున్న అన్యాయంపై ఆయన నోరు మెదపడం లేదన్నారు. భారత దేశం లౌకిక దేశమని పాలకులు గుర్తుంచుకోవాలన్నారు. ముస్లింల హక్కులను హరించే వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నేడు తమ పార్టీ ఆధ్వర్యంలో నంద్యాలలోని గాంధీ చౌక్‌లో నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇందులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

#### కూటమి ప్రభుత్వం ముస్లింలకు ద్రోహం

సమావేశంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చి కూటమి ప్రభుత్వం ముస్లింలను ద్రోహం చేసిందని అన్నారు. తమ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్, రాజ్యసభల్లో తీవ్రంగా వ్యతిరేకించి మైనార్టీల పక్షాన నిలిచిందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంతో మైనార్టీలకు తీవ్రం అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి వత్తాసు పలికిన టీడీపీ, జనసేన పార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు.వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టే నిరసన కార్యక్రమంలో అందరు పాల్గొని మైనార్టీలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్‌బాషా, జిల్లా ఇంటలెక్చువల్ వింగ్ ప్రసిడెంట్ రసూల్ ఆజాద్, మైనార్టీ నాయకులు జీఎం గౌస్, పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవనగర్ బాషా, జనరల్ సెక్రటరీ సోమశేఖర్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు సోహెల్ రాణా, కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్, మాజీ కౌన్సిలర్ జాకీర్ హుసేన్, నాయకులు రహంతుల్లా పాల్గొన్నారు.



కొండాపురంలో రోడ్లపై వడ్లు ఆరబోస్తున్న రైతులు

## ఆ‘ధర’ణ ఏదీ!



భాగ్యనగరం వద్ద రైతులు పొలాల్లోనే వరిధాన్యం విక్రయిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: ఆరుగాలం శ్రమించినా రబీ రైతులకు కలిసిరాలేదు. వరికి సరైన గిట్టుబాటు ధర లేక అవస్థలు పడుతున్నారు. మండలంలో కేసీ, కుందూతీరం కింద 450 హెక్టార్ల వరకు వరి పంట సాగు చేశారు. సరియైన సమయంలో సాగునీరు అందక చివరి ఆయకట్టు పూర్తిగా చేతికి రాకుండా పోయింది. చేతికొచ్చిన పంట కూడా ధరపలకడం లేదు. వ్యాపారులు బస్తాను రూ.1,300 మించి తీసుకోవడం లేదు. కొందరు రైతులు తప్పని పరిస్థితుల్లో వ్యాపారులు అడిగిన ధరకు విక్రయించుకుంటున్నారు. తేమశాతం అధికంగా ఉందని ధర తగ్గిస్తుండటంతో ఇంకొందరు రోడ్లపై ఆరబోసుకుంటున్నారు. ఆకాలవర్షాలకు భయపడి మరి కొంతమంది రైతులు పొలాల్లోనే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు.

## మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబా మల్లికార్జునస్వామివారికి సోమవారం సహస్ర దీపార్చన సేవ నిర్వహించారు. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రాల నడుమ సహస్రదీపార్చన పూజలు చేశారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

#### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన మహతి నృత్య కళానికేతన్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో గణపతి ప్రార్థన, మూషికవాహన, లింగాష్టకం, అయిగిరినందిని, శివాష్టకం, శివతాండవం తదితర గీతాలకు, అష్టకాలకు హర్షిత, శరణ్య, హేమ, మహతి, హిమజ్ఞ, కౌముది, మనస్వి, ఆరాధ్య తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

## శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 26, 27, 28 తేదీల్లో కడపలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న పిలుపునిచ్చారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఆ సంఘం మాజీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్పతో కలసి కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇంటర్మీడియట్ విద్యను మంత్రి నారాయణ సంస్థలకు అప్పగించాలన్న ఆలోచనలు మానుకోవాలన్నారు.

#### 25 నుంచి ఆర్చరీ వేసవి శిక్షణ శిబిరం

కర్నూలు (టౌన్): ఈనెల 25వ తేదీ నుంచి నగరంలో ఉచిత ఆర్చరీ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 రోజులు పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9393855460ను సంప్రదించాలని సూచించారు.